అంధకారంలో అర్వపల్లి రోడ్లు

- రెండు హైవేలపై కొన్నిచోట్లనే వెలుగుతున్న లైట్లు
- రాత్రి అయితే పలు వీధులు, ప్రధాన రోడ్లపై చీకట్లు
- సెంట్రల్ లైట్ల ఆన్‌ఆఫ్ స్విచ్‌లు కాలిపోయినా పట్టించుకోవట్లే..


సూర్యాపేట-జనగామ రోడ్డులో వెలగని లైట్లు


చీకటిమయంగా అర్వపల్లి దేవాలయ పరిసరాలు

అర్వపల్లి: రెండు జాతీయ రహదారులకు ప్రధాన కూడలి అయిన అర్వపల్లిలో అంధకారం అలుముకుంది. సూర్యాపేట-జనగామ, నకిరేకల్-తానంచర్ల హైవేలతోపాటు పలు వీధుల్లో లైట్లు వెలగక చీకట్లు కమ్ముకున్నాయి. కొంత కాలంగా ఇక్కడ వీధిలైట్లు వేయకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. కేవలం రెండు జాతీయ రహదారులపై వెలిగే కొన్ని సెంట్రల్ లైట్లు తప్ప రహదారుల పొడవునా, వీధుల్లో వీధిలైట్లు వెలగడం లేదు. కాగా సూర్యాపేట-జనగామ రోడ్డులో ఎంపీడీఓ కార్యాలయానికి వెళ్లే దారిలో సెంట్రల్‌లైట్ల ఆన్‌ఆఫ్ స్విచ్‌ల బోర్డు కాలిపోయి 20 రోజులు అవుతుంది. అప్పటి నుంచి ఈ రూట్లో సెంట్రల్ లైట్లు వెలగడం లేదు. అలాగే తుంగతుర్తి రోడ్డు జాతీయ రహదారి కావడంతో వాహనాల రద్దీ అధికంగా ఉంటుంది. ఈ వీధిలో డివైడర్ల వరకు మాత్రమే కొన్ని సెంట్రల్ లైట్లు వెలుగుతున్నాయి. మిగిలిన వీధిలో లైట్లు వెలగక సాయంత్రమైతే అంధకారంగా ఉంటోంది.

అర్వపల్లి దేవాలయం వద్ద చీకట్లు..

అర్వపల్లిలోని ప్రముఖ శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి దేవాలయం ఎదుట లైట్లు లేక ఆలయ పరిసరాలు చీకటిమయంగా మారుతున్నాయి. కాసర్లపహాడ్ రోడ్డు, టెంపుల్ దారులు, ముదిరాజ్ కాలనీతో పాటు పలు వీధుల్లో లైట్లు వెలగడంలేదు. అధికారులు సెంట్రల్‌లైట్లు, వీధిలైట్లు వేయించి ఇబ్బందులు తీర్చాలని స్థానికులు కోరుతున్నారు.

లైట్లను పునరుద్ధరించాలి



“అర్వపల్లి హైవేలతోపాటు పలు వీధులు రాత్రయితే అంధకారంగా మారుతున్నాయి. రాత్రి వేళలో బయటకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. మండల కార్యాలయాల కేంద్రం, హైవేల కూడలి అయిన అర్వపల్లిలో కనీసం లైట్లు వెలగని పరిస్థితి నెలకొంది. వెంటనే లైట్లను పునరుద్ధరించాలి.

\- మనుబోతుల శివకుమార్, అర్వపల్లి

మెరుగైన సేవల కోసం..


సూర్యాపేట మున్సిపల్ కార్యాలయం

సూర్యాపేట అర్బన్ : ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు, ప్రజలు తమ సమస్యలను నేరుగా మున్సిపల్ సెక్షన్ అధికారులకు తెలిపేందుకు వీలుగా ఈ క్రింది అధికారుల సెల్ ఫోన్ నంబర్లు అందుబాటులో ఉంటాయని మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్ ఆదివారం తెలిపారు. ఏదైనా సమావేశాల కారణంగా ఫోన్ లిఫ్ట్ చేయకపోతే టెక్స్ట్ మెసేజ్ లేదా వాట్సాప్‌లో మీ సమస్యను తెలపాలని ఆయన సూచించారు.

అధికారుల ఫోన్ నంబర్లు..

- నీటి సరఫరా సమస్య పరిష్కారానికి : ఎం. తిరుమలయ్య, ఏఈ –9849906795
- వీధి దీపాల సమస్య పరిష్కారానికి : వై.రాజు రెడ్డి, టెక్నికల్ ఆఫీసర్ – 77020 00960
- మౌలిక వసతులు, ఇతర సమస్యలకు : బీవీ.సత్యారావు, డీఈ – 98499 06794; ఎం. కిరణ్ , ఈఈ – 98499 06796
- పారిశుద్ధ్య నిర్వహణ పనులకు : సారగండ్ల శ్రీనివాస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ – 98499 08022; జెనపల్లి యాదగిరి, ఇన్‌చార్జ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ – 90326 82512
- టౌన్ ప్లానింగ్ విభాగము : ఉయ్యాల సోమయ్య, టీపీఓ –86868 21450
- రెవెన్యూ విభాగం : టి.కళ్యాణి, ఆర్వో మరియు ఇన్‌చార్జ్ మేనేజర్ –98499 08250
- మెప్మా : శ్వేత, టీఎంసీ – 63009 58256

పై అధికారులు స్పందించనిచో మున్సిపల్ కమిషనర్ 9849905912కు కాల్ లేదా వాట్సాప్ రూపంలో మెస్సేజ్ చేయగలరు.

క్లుప్తంగా

కరపత్రం ఆవిష్కరణ


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆత్మకూర్(ఎస్): తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు అలుగుబెల్లి వెంకట నరసయ్య స్థూపం ఆవిష్కరణ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కొనకుంట్ల సైదులు, ఏఐకేఎంఎస్ జిల్లా నాయకుడు అలుగుబెల్లి వెంకటరెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని తుమ్మలపెన్‌పహాడ్ గ్రామంలో అలుగుబెల్లి వెంకట నరసయ్య స్థూపం ఆవిష్కరణ కరపత్రాలను విడుదల చేసి మాట్లాడారు. జూలై 3న తుమ్మలపెన్‌పహాడ్ గ్రామంలో అలుగువెల్లి వెంకట నరసయ్య స్తూపంతోపాటు అమర వీరుల స్థూపం ఆవిష్కరణ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు నల్లగొండ నాగయ్య, కంచర్ల నర్సమ్మ, వీరయ్య, అంజయ్య, రాములు, మల్లయ్య, సుధాకర్, గాంధీ పాల్గొన్నారు.

పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం చైర్మన్‌కు సన్మానం

అర్వపల్లి : మండల పరిధిలోని కాసర్లపహాడ్ గ్రామానికి చెందిన పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం చైర్మన్‌గా మాచర్ల మల్లయ్య రెండోసారి ఎన్నిక కావడంతో ఆదివారం అతడిని గ్రామస్తులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు బొల్లం లింగరాజు, నల్లగుంట్ల శ్రీనివాస్, బొల్లం శ్రీశైలం, సైదా, మహేష్, మంచాల రాము, డైరెక్టర్లు గుడిపాటి సైదులు, సోదయ్య, లింగరాజు, వెంకన్న, రామనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత


గానుగబండలో బాధిత కుటుంబానికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేస్తున్న నాయకులు

తుంగతుర్తి : మండల పరిధిలోని గానుగబండ గ్రామంలో ఇటీవల ప్రమాదవశాత్తు తాటిచెట్టు పైనుంచి పడి చికిత్సపొందుతూ మృతి చెందిన పంజాల సోమయ్య కుటుంబాన్ని గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆదివారం పరామర్శించారు. మృతుడి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చిన రూ.28వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును బాధిత కుటుంబ సభ్యులకు పంపిణీ చేశారు. అలాగే 50 కేజీల బియ్యాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ సెల్ మండల అధ్యక్షుడు రుద్ర రామచంద్రు, గ్రామ శాఖ అధ్యక్షుడు బోర జలంధర్, సోషల్ మీడియా కోఆర్డినేటర్ అబ్బగాని వేణు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పులి ముత్తయ్య, కార్యకర్తలు గ్రామస్తులు పాల్గొన్నారు.

పేద విద్యార్థినికి చేయూత


పుస్తకాలు అందజేస్తున్న పావనిక్రుపాకర్

సూర్యాపేట : మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి ఆదేశాల మేరకు 45వ వార్డు మాజీ కౌన్సిలర్ పావనికృపాకర్ ఆదివారం పట్టణంలోని నిరుపేద కుటుంబానికి చెందిన విద్యార్థినికి రూ.10,500 విలువ గల ఇంటర్ సెకండ్ ఇయర్ పుస్తకాలను కొనుగోలు చేసి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పట్టణానికి చెందిన ఎండీ అలీ కుమార్తె ఆసియా నజీమా సూర్యాపేటలోని ఓ ప్రైవేట్ కాలేజీలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతుందని, ఇంటర్ మొదటి సంవత్సరంలో మంచి మార్కులు సాధించిందని తెలిపారు.

బీజేపీ మండల సమావేశం

హుజూర్‌నగర్ : పట్టణంలో బీజేపీ మండల కమిటీ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీ 11ఏళ్ల ప్రభుత్వ పాలనపై, గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పథకాలపై చర్చించారు. సమావేశంలో పార్టీ నాయకులు నారపురెడ్డి, సోమయ్య, కోటిరెడ్డి, లక్ష్మణ్, జనార్దన్‌రెడ్డి, శ్రీకాంత్, సాయి, తదితరులు పాల్గొన్నారు.

కరాటే విద్యార్థులకు సర్టిఫికెట్ల ప్రదానం


కరాటే విద్యార్థులకు బెల్టులు, సర్టిఫికెట్లు అందజేస్తున్న డీఎస్పీ ప్రసన్నకుమార్

సూర్యాపేటటౌన్ : మన దేశంలో పుట్టి ఇతర దేశాల్లో అభివృద్ధి చెందిన మార్షల్ ఆర్ట్స్ కరాటేను మనదేశంలో కూడా ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని సూర్యాపేట డీఎస్పీ ప్రసన్నకుమార్ అన్నారు. ఆదివారం స్థానిక విద్యానగర్ బేబీమూన్ ఉన్నత పాఠశాలలో సుమన్ షోటో ఖాన్ స్పోర్ట్స్ కరాటే అకాడమీ మాస్టర్ జే.వీ.రమణ ఆధ్వర్యంలో కరాటే శిక్షణ పొందిన విద్యార్థిని విద్యార్థులకు బెల్టులు, సర్టిఫికెట్లు ప్రదానం చేసి మాట్లాడారు. తమను తాము రక్షించుకునేందుకు కరాటే ఎంతో దోహదపడుతుందన్నారు. ప్రస్తుత సమాజంలో బాలికలకు కరాటే శిక్షణ ఎంతో అవసరమని, పట్టణంలోని ప్రతి సెంటర్‌లో కరాటే శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసి కరాటే విద్యను నేర్పించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. కరాటేతో యువత మద్యపానం, డ్రగ్స్ వంటి చెడు అలవాట్ల బారిన పడకుండా దృష్టిని మరల్చవచ్చని తెలిపారు. అనంతరం కరాటే విద్యార్థిని విద్యార్థులకు ఎల్లో బెల్టులు 30, గ్రీన్ బెల్టులు 20, ఆరెంజ్ బెల్ట్ 10, బ్రౌన్ 1, బ్లాక్ 1తో పాటు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఏజీపీ షఫీ ఉల్లా, కరాటే మాస్టర్లు జేవీ రమణ, సంతోష్, సాయి కిరణ్, రిషి, చైతన్య పాల్గొన్నారు.

ఎలక్ట్రికల్ బస్సులను సద్వినియోగం చేసుకోవాలి

అర్వపల్లి : సూర్యాపేట నుంచి అర్వపల్లి, తిరుమలగిరి మీదుగా హైదరాబాద్‌కు నడిపిస్తున్న ఎక్స్‌ప్రెస్ ఎలక్ట్రికల్ బస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూర్యాపేట ఆర్టీసీ డిపో మేనేజర్ జి.లక్ష్మీనారాయణ, అసిస్టెంట్ మేనేజర్ బాణోతు సైదులు కోరారు. సూర్యాపేట-జనగామ రూట్లో నడుస్తున్న ఎలక్ట్రికల్ బస్సులను ఆదివారం అర్వపల్లిలో పరిశీలించి మాట్లాడారు. ప్రస్తుతం ఈ రూట్లో 5 బస్సులు నడుస్తున్నాయని చెప్పారు. వీటిని వినియోగించుకోవాలని విజ్ఞప్తిచేశారు. ఈ కార్యక్రమంలో స్థానికులు, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఆలయ వార్షికోత్సవం

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలం బొల్లంపల్లి గ్రామంలోని శ్రీవిశాలాక్షి సమేత విశ్వేశ్వరస్వామి ఆలయ ద్వితీయ వార్షికోత్సవం సోమవారం జరగనుంది. ఈ ఉత్సవానికి సంబంధించి ఆలయాన్ని ముస్తాబు చేశారు. అయితే సోమవారం ఉదయం అఖండ దీపారాధన, గణపతిపూజ, పుణ్యహవాచనం, మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, రుద్ర హోమం జరగనున్నాయి. అలాగే మధ్యాహ్నం బలిహరణ, పూర్ణాహుతి కార్యక్రమాలు జరుగుతాయని ప్రధాన అర్చకుడు మోత్కూరు రాజుశర్మ తెలిపారు. భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి స్వామి తీర్థప్రసాదాలను స్వీకరించి శివానుగ్రహం పొందాలని దేవాలయ ఉత్సవ కమిటీ సభ్యులు కోరారు.

తెలంగాణ ఉద్యమకారులను గుర్తించాలి

అర్వపల్లి : తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారులను ప్రభుత్వం గుర్తించి ఆదుకోవాలని తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం నియోజకవర్గ కన్వీనర్ దిర్శనపు కృష్ణమూర్తి కోరారు. అర్వపల్లిలో ఆదివారం జరిగిన సంక్షేమ సంఘం మండల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఉద్యమకారులకు గుర్తింపుకార్డులు ఇవ్వాలని, 250 గజాల ఇంటి స్థలాన్ని కేటాయించి, నెలకు రూ.25 వేల పింఛన్ మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. తమకు ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుకై ఇటీవల నెలరోజులు పాదయాత్ర కూడా చేశామని చెప్పారు. హామీలను నెరవేర్చకపోతే రాష్ట్ర సాధన కోసం పోరాడిన విధంగానే మరో పోరాటం చేస్తామన్నారు. ఈ సమావేశంలో ఉద్యమకారుల సంఘం నాయకులు కుదురుపాక ఉదయ్, దడిపల్లి వెంకట్, లింగంపల్లి రమణ, కుంభం మధు, శివన్, యాదగిరి, మల్లయ్య, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం


ఉయ్యాలవాడలో నిర్మాణంలో ఉన్న ఇల్లు

అర్వపల్లి : పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపికైన జాజిరెడ్డిగూడెం మండలంలోని ఉయ్యాలవాడలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. అయితే మొట్టమొదట ఈ గ్రామాన్ని ఎంపిక చేసి ఇళ్ల నిర్మాణం చేపట్టారు. గ్రామానికి 107 ఇళ్లు మంజూరు అయ్యాయి. ఇందులో 50 ఇళ్లు బేస్‌మెంట్ లెవల్‌కు వచ్చాయి. మరో 50 ఇళ్ల నిర్మాణానికి మార్కింగ్ ఇచ్చారు. ఆరు ఇళ్లు రూఫ్ లెవల్ వరకు నిర్మించారు. ఒక ఇల్లు స్లాబ్ లెవల్ వరకు పనులు జరిగాయి. ఇళ్ల పనులను త్వరగా పూర్తి చేయడానికి సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు గ్రామాన్ని సందర్శించి పనులను పర్యవేక్షిస్తున్నారు.

పనులు జరుగుతున్నాయి



“ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు ఉయ్యాలవాడలో ముమ్మరంగా జరుగుతున్నాయి. మొత్తం 107 ఇళ్లు మంజూరయ్యాయి. అందులో 50 ఇళ్లు బేస్‌మెంట్ లెవల్ వరకు అయ్యాయి. మరో 50 నిర్మాణాలకు మార్కింగ్ ఇచ్చాము. ఆరు ఇళ్లు రూఫ్ లెవల్ వరకు వచ్చాయి. విడతల వారీగా లబ్ధిదారులకు బిల్లులు చెల్లించడం జరుగుతుంది.

\- టి.గోపి ఎంపీడీఓ, జాజిరెడ్డిగూడెం

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి


పెన్‌పహాడ్‌లో సమ్మె బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు రణపంగ కృష్ణ

పెన్‌పహాడ్ : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెచ్చిన లేబర్ కోడ్‌లను తిప్పికొట్టేందుకు జూలై 9న దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు రణపంగ కృష్ణ పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో వివిధ రంగాల కార్మికులతో సమ్మె బుక్‌లెట్‌ను విడుదల చేసి మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను కుదించి నాలుగు లేబర్ కోడ్‌లను తేవడం వల్ల కార్మిక హక్కులకు భంగం వాటిల్లుతుందని తెలిపారు. బీజేపీ ప్రభుత్వం పూర్తిగా కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా చట్టాలను మారుస్తోందన్నారు. సమ్మెలో ఉద్యోగులు, కార్మికులు, అసంఘటిత రంగ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జంజిరాల సరస్వతి, శ్రావణి, సిల్వేరు లక్ష్మి, శోభ, వనిజ, రాణి, బుచ్చమ్మ, సత్యం, పలువురు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

లేబర్ ఇన్సూరెన్స్‌తో కార్మికులకు ధీమా


బీమా హామీ పత్రాన్ని అందజేస్తున్న నాయకులు

తుంగతుర్తి : భవన నిర్మాణ కార్మికులకు లేబర్ ఇన్సూరెన్స్ కార్డు ఆర్థికంగా తోడ్పడుతుందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య అన్నా రు. మండల పరిధిలోని బండరామారం గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన భవన నిర్మాణ కార్మికురాలు కుటుంబ సభ్యులకు ఆదివారం లేబర్ ఇన్సూరెన్స్ హామీ పత్రాన్ని అందజేసి మాట్లాడారు. త్వరలో ఒక లక్ష 30 వేల రూపాయలు వారి కుటుంబ సభ్యులకు అందజేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భారత రాష్ట్ర సమితి కార్మిక విభాగం నియోజకవర్గ ఇన్‌చార్జ్ గౌడిచర్ల సత్యనారాయణ, బీఆర్ఎస్ జిల్లా నాయకులు ఉప్పలయ్య, ఎల్లయ్య, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తిగా సీసీ రోడ్డు నిర్మాణం


నిరసన వ్యక్తం చేస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

మునగాల : మండల కేంద్రంలోని కొక్కిరేణి వెళ్లే మార్గంలో అసంపూర్తిగా వదిలేసిన సీసీరోడ్డు నిర్మాణంతో ఆ రోడ్డులో ప్రయాణించే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని డీవైఎఫ్ఐ మండల కార్యదర్శి గడ్డం వినోద్ అన్నారు. ఈ సందర్భంగా సంఘం ఆధ్వర్యంలో ఆయన ఆదివారం అసంపూర్తిగా ఉన్న రోడ్డుపై నిల్చుని నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు. మండల కేంద్రంలో సుమారు 800మీటర్ల పొడవు సీసీరోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం మూడు నెలల క్రితం రూ.10కోట్లు మంజూరు చేసిందని, ఈ నిర్మాణంలో భాగంగా కాంట్రాక్టర్ సుమారు 50మీటర్ల మేర సీసీరోడ్డు నిర్మాణం చేపట్టకుండా వదలేశాడని, దీంతో ఆదర్శ పాఠశాల విద్యార్థులు, పది గ్రామాలకు చెందిన ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, అదే విధంగా 800మీటర్ల సీసీరోడ్డుకు ఇరుపక్కలా సైడ్ బర్మ్ పోయకుండా వదలి వేశాడని ఆరోపించారు. తక్షణమే అసంపూర్తిగా ఉన్న రోడ్డును పూర్తి చేసి రోడ్డుకు ఇరుపక్కలా మార్జిన్‌పై మట్టిపోయాలని, లేకుంటే సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ మండల కమిటీ సభ్యుడు దేవరం శ్యాంసుందర్‌రెడ్డి, సందీప్ పాల్గొన్నారు.

డ్రగ్స్ సేవించి జీవితాలు నాశనం చేసుకోవద్దు


తాళ్లగడ్డ (సూర్యాపేట) : గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు


తిరుమలగిరిలో..


పెన్‌పహాడ్‌లో..

తాళ్లగడ్డ (సూర్యాపేట) : డ్రగ్స్ సేవించడం వల్ల జీవితాలు చెల్లాచెదురు అవుతాయని, డ్రగ్స్ సేవించి జీవితాలు నాశనం చేసుకోవద్దని సూర్యాపేట రూరల్ సీఐ రాజశేఖర్ అన్నారు. ఈ నెల 26న మదకద్రవ్యాల నిర్మూలన దినోత్సవం సందర్భంగా శనివారం సూర్యాపేట మండల పరిధిలోని ఆరెగూడెంలో రూరల్ పోలీసుల ఆధ్వర్యంలో గ్రామస్తులకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. డ్రగ్స్ వల్ల శరీరంపై అదుపు కోల్పోతామని, యువకులు డ్రగ్స్ బారిన పడటం వల్ల శరీర శక్తి నశిస్తుందని తెలిపారు. ఇలాంటి మాదకద్రవ్యాలను నిర్మూలించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. యువత ఆదర్శంగా ఉండాలని, మంచి భవిష్యత్తు కోసం నిరంతరం కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ బాలు నాయక్, పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

తిరుమలగిరి : విద్యార్థులు డ్రగ్స్ నుంచి దూరంగా ఉండాలని, వాటిని వినియోగిస్తే భవిష్యత్తు నాశనం అవుతుందని తిరుమలగిరి ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. మాదక ద్రవ్యాల నిర్మూలనలో భాగంగా ఆదివారం మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిరావు పూలే రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. డ్రగ్స్ వినియోగించడం వల్ల మన నాడీ వ్యవస్థ అధీనంలో ఉండదని, తద్వారా శక్తి నిర్వీర్యమవుతుందని అన్నారు. డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ నికోలస్ తదితరులు పాల్గొన్నారు.

పెన్‌పహాడ్ : డ్రగ్స్ నిర్మూలనలో ప్రజలు తమవంతు సహకారం అందించాలని ఎస్ఐ గోపికృష్ణ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని కస్తూరిబాగాంధీ బాలికల పాఠశాలలో మాదకద్రవ్యాల నిర్మూలనపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు మంచి అలవాట్లను కలిగి ఉండి కష్టపడి చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని తెలిపారు. తోటి విద్యార్థులతో క్రమ శిక్షణగా స్నేహపూర్వకంగా మెలగాలని అన్నారు.

డ్రగ్స్ నిర్మూలనకు వినూత్న ప్రచారం


ఎస్వీ డిగ్రీ కళాశాల మైదానంలో ప్రచారం నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు ప్రభాకర్

సూర్యాపేటటౌన్ : డ్రగ్స్ వద్దు ప్రాణం ముద్దు అని, మత్తు పదార్థాలకు బానిసై విలువైన జీవితాలను నాశనం చేసుకోవద్దని సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలం గోరెంట్ల ఉపాధ్యాయుడు రాచకొండ ప్రభాకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎస్వీ కళాశాల గ్రౌండ్‌లో ఆదివారం ఉదయం పాదచారులకు మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. మద్యపానం, ధూమపానం ఆరోగ్యానికి హానికరమని కరపత్రాలు పంచారు. చేతిలో మైకు పట్టుకుని ఫ్లెక్సీతో విచిత్ర వేషధారణతో ప్రచారం నిర్వహించారు.


తుంగతుర్తిలో..


నాగారంలో..

ప్రస్తుత సమాజంలో డ్రగ్స్ తీవ్ర సమస్యగా ఉన్నాయని, వీటి నిర్మూలనలో విద్యార్థుల పాత్ర ఎంతో అవసరమని తెలిపారు. మత్తు పదార్థాల వల్ల జరుగుతున్న అనర్థాలను పెద్దలకు, తల్లిదండ్రులకు, ప్రజలకు తెలియజేయాలని విద్యార్థులకు సూచించారు. అవగాహనతోనే డ్రగ్స్ నిర్మూలించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ ఆంగోతు యాదగిరి, కానిస్టేబుల్స్ మహేష్, ప్రవీణ్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

తుంగతుర్తి : డ్రగ్స్ మత్తుతో జీవితం మసి అవుతుందని ఎస్ఐ రుద్ర క్రాంతికుమార్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో మాదక ద్రవ్యాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించి మాట్లాడారు. డ్రగ్స్ మానేస్తే జీవితం ఖుషీ అవుతుందని అన్నారు. మదక ద్రవ్యాల నివారణకు ప్రతి ఒక్కరూ సైనికుల వలే పనిచేయాలని, వాటికి సంబంధించిన సమాచారం పోలీసులకు అందించాలని కోరారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమవంతుగా తోడ్పాటు అందించాలని సూచించారు. డ్రగ్స్ నిర్మూలన దినోత్సవం సందర్భంగా అవగాహన కల్పిస్తూ ప్రజలను చైతన్య పరుస్తున్నట్లు తెలిపారు.

నాగారం : యువత డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ ఐలయ్య అన్నారు. మాదక ద్రవ్యాల నిర్మూలనపై ఆదివారం మండల కేంద్రంలో యువత, ప్రజలకు అవగాహన కల్పించారు. యువత చెడు వ్యసనాల బారిన పడకుండా, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. మాదక ద్రవ్యాల నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ, ఆర్థికసాయం


సూర్యాపేట అర్బన్ : నివాళులర్పిస్తున్న నాయకులు


అర్వపల్లి : ఆర్థికసాయం అందజేస్తున్న చైర్మన్

సూర్యాపేట అర్బన్ : పట్టణంలోని తాళ్లగడ్డకు చెందిన రాపర్తి మల్సూర్ గౌడ్ గుండెపోటుతో, కక్కిరేణి శివకుమార్ గౌడ్ బ్రెయిన్ స్ట్రోక్‌తో ఇటీవల మరణించారు. ఆదివారం మృతుల కుటుంబాలను సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కేవీఎల్, జై గౌడ సంఘం రాష్ట్ర నాయకుడు బూర మల్సూర్ గౌడ్‌లు పరామర్శించారు. మృతుల చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. వీరి వెంట సీపీఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, ప్రవీణ్ ఉన్నారు.

అర్వపల్లి : మండల పరిధిలోని కొమ్మాల గ్రామానికి చెందిన యన్నమళ్ల గోపాల్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. అలాగే గంగధరి రాంబాబు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. సూరారపు కిరణ్ కుటుంబీకులు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. దీంతో ఆయా కుటుంబాలను ఆదివారం పీఏసీఎస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి పరామర్శించి ఒక్కో కుటుంబానికి రూ. 5వేల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మందడి పూర్ణ చంద్రారెడ్డి, కుక్కడపు సైదులు, గంగధరి శ్రీనివాస్, కుదురుపాక ఉదయ్, ఎస్.వెంకటాద్రి, ఎస్.సైదులు, వీరభద్రం, రాములు, వెంకటయ్య, నర్సింహ, శ్రీరాములు, అజయ్, సైదులు, ముత్తయ్య, నాగయ్య, యాదగిరి పాల్గొన్నారు.

చివ్వెంల(సూర్యాపేట) : మండల పరిధిలోని వాల్యతండా గ్రామ ఆవాసం మంగళితండాకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ధరావతు బాలు నాయక్ (58) గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం మృతి చెందాడు. అతడి మృతదేహాన్ని పలువురు కాంగ్రెస్ నాయకులు సందర్శించి, భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ధరావత్ వీరన్న నాయక్, గ్రామ శాఖ అధ్యక్షుడు ధరావత్ నరేష్‌నాయక్, మండల ఉపాధ్యక్షుడు జంపాల అంజయ్య, మండల బీసీ సెల్ అధ్యక్షుడు యల్కపల్లి వెంకన్న, గోగుల శ్రీనివాస్, సైదులు యాదవ్, గోగుల ఈదయ్య, మహేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బొడ్రాయి ఐదవ వార్షికోత్సవం


బొడ్రాయికి బోనాలు సమర్పిస్తున్న మహిళలు

పెన్‌పహాడ్ : మండల పరిధిలోని నూర్జహాన్‌పేట గ్రామంలో బొడ్రాయి ఐదవ వార్షికోత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలతో ర్యాలీగా వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించి పూజలు నిర్వహించారు. అనంతరం అభిషేకాలు చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

మున్నూరు కాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుల ఎన్నిక

హుజూర్‌నగర్ : పట్టణానికి చెందిన ఇరువురు తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు సంఘం ఉపాధ్యక్షులుగా ఎన్నికయ్యారు. ఆదివారం హైదరాబాద్‌లోని ప్రెస్‌క్లబ్‌లో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండా దేవయ్య పటేల్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జల్లేపల్లి వెంకటేశ్వర్లు పట్టణానికి చెందిన కోలా నాగేశ్వరరావు, ధూళిపాల శ్రీనివాసరావుకు రాష్ట్ర ఉపాధ్యక్షులుగా నియమిస్తూ వారికి నియామక పత్రాలు అందజేశారు. మున్నూరు కాపు సంఘం బలోపేతానికి కృషి చేస్తామన్నారు. తన నియామకానికి సహకరించిన ప్రతిఒక్కరికి వారు కృతజ్ఞతలు తెలిపారు.